నమస్తే తెలంగాణ



సిద్దిపేట మార్కెట్ యార్డులో సోమవారం కురిసిన వర్షానికి తడిసిన ధాన్యం

# రైతు కష్టం వర్షార్పణం

**భారీ వానకు కొట్టుకుపోయిన ధాన్యం**

**నాలుగురోజులైనా పత్తాలేని కొనుగోళ్లు**


**తడిసిన ధాన్యం చూసి రైతుల కన్నీళ్లు**

(నమస్తే తెలంగాణ, న్యూస్‌నెట్‌వర్క్) : ఆరుగాలం పండించిన పంట చేతికొచ్చిన తరువాత సర్కారు నిర్లక్ష్యం కారణంగా వర్షార్పణం అయింది. రైతుల నోటిగాడ ముద్ద నీళ్లపాలయింది. సోమవారం కురిసిన భారీ వర్షం రైతులకు తీరని కష్టాన్ని మిగిల్చింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట, లింగంపేట తదితర మండలాల్లో గంటకుపైగా వాన దంచికొట్టింది. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. వర్షపు నీటి ఉధృతికి వడ్లు కొట్టుకుపోయాయి. సిద్దిపేట మార్కెట్ యార్డులోనూ వడ్లు, మొక్కజొన్నలు వర్షానికి తడిసి ముద్దయ్యాయి. నాలుగైదు రోజులైనా ధాన్యం కొనేవారు లేరని రైతులు కన్నీరు మున్నీరయ్యారు. చేతికి వచ్చిన పంట కళ్లముందే కొట్టుకుపోతుండటంతో.. రైతులు కన్నీళ్లు పెడుతూ, అచేతనులై చూస్తుండి పోయారు. ప్రభుత్వం సకాలంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించక పోవడంతోనే తమకీ దుస్థితి ఏర్పడిందని రైతులు వాపోయారు. ప్రభుత్వం వెంటనే వడ్లనుకొని ఆదుకోవాలని తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.


సిద్దిపేట మార్కెట్ యార్డులో భారీ వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యాన్ని కుప్పగా చేస్తున్న రైతులు


కామారెడ్డి జిల్లా లింగంపేట్‌లో వర్షపు నీటి నుంచి ధాన్యాన్ని ఎత్తుతున్న మహిళా రైతు


జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారం గ్రామంలో వర్షానికి నేలవాలిన వరిపంట


ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం కొత్తకారాయిగూడెంలో కురిసిన వర్షానికి నేలకొరిగిన వరి

## నేలకొరిగిన రైతుల ఆశలు!

- కండ్ల ముందే పంట నేలపాలు
- ధాన్యం వస్తుందనుకునేలోపే కురిసిన వర్షం
- భారీగా దెబ్బతిన్న పంటలు.. వేల ఎకరాల్లో నష్టం

పెనుబల్లి (కల్లూరు)/జూలూరుపాడు/ దుమ్ముగూడెం/పెద్దపల్లి/ సారంగాపూర్, అక్టోబర్ 21 : పండిన పంట చేతికొచ్చిందనుకునేలోపే కురిసిన వర్షం కళ్లముందే ఆ పంటను నేలపాలు చేసింది. దీంతో అన్నదాతలు ఆవేదనకు గురవుతున్నారు. ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలోని చంద్రుపట్ల, ఎర్రబోయినపల్లి, కొత్తలింగాల, కిష్టయ్యబంజర, గోపారం, కప్పలబంధం తదితర గ్రామాల్లో కోతకొచ్చిన పంట గాలి దుమారంతో కూడిన భారీ వర్షానికి నేల కొరిగింది. భద్రాద్రి జిల్లా జూలూరుపాడు మండలంలో వర్షానికి పత్తి, మిర్చి పంటలు దెబ్బతిన్నాయి. దుమ్ముగూడెం మండలంలోనూ వందల ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. పెనుబల్లి మండలం కొత్తకారాయిగూడెం, కోంద్రుపాడు, అడవిమల్లెల, కుప్పెనకుంట్ల గ్రామాల్లో కురిసిన వర్షానికి వరి పంట నేలవాలింది. జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని పలు గ్రామాల్లో ఈదురుగాలులతో వర్షం పడడంతో కోతకచ్చిన వరిపంటలు నేలకొరిగాయి. తాళ్ల ధర్మారం గ్రామంలో సుమారు వంద ఎకరాల్లో పంటలు నేలవాలాయి. దీంతో రైతుల ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# కొనలేని కేంద్రాలు

మొదటిపేజీ తరువాయి...

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించిన అధికారులు ఇప్పటివరకు వంద కూడా ప్రారంభించలేదని తెలిసింది. ఉమ్మడి నల్గొండ, ఉమ్మడి నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో అక్కడక్కడ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి చేతులు దులిపేసుకుందనే ఆరోపణలు ఉన్నాయి.

### మిల్లర్ల దోపిడీ..

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో ఇదే అదునుగా మిల్లర్లు దోపిడీకి తెరతీశారు. రైతుల బలహీనతలను అవకాశంగా మలుచుకొని తక్కువ ధరకే ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ధాన్యం క్వింటాలు మద్దతు ధర రూ. 2320గా ఉన్నది. ఇక సన్న ధాన్యానికి సర్కారు రూ. 500 బోనస్ ఇస్తామని ప్రకటించింది. ఈ లెక్కన సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ. 2820 ధర దక్కాలి. కానీ రైస్ మిల్లర్లు దొడ్డు ధాన్యానికి రూ. 1800 నుంచి రూ. 1900 వరకు చెల్లిస్తుండగా, సన్న ధాన్యానికి రూ. 2100-2300 వరకు చెల్లిస్తున్నారు. రైతులు ప్రతి క్వింటాకు దొడ్డు ధాన్యానికి రూ. 500 వరకు నష్టపోతుండగా, సన్న ధాన్యానికి రూ. 700 వరకు నష్టపోతున్నారు. దీంతో మద్దతు ధర దక్కక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నష్టమని తెలిసినా మరో దిక్కులేకపోవడంతో రైతులు తమ ధాన్యాన్ని తక్కువ ధరకే మిల్లర్లకు అమ్ముకుంటున్నారు.

### తుఫాను ముప్పు

రాష్ట్రానికి తుఫాను హెచ్చరికలు జారీ అయ్యాయి. వచ్చే వారం రోజుల్లో భారీ అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో రైతుల్లో ఆందోళన మరింత ఎక్కువైంది. చేతికొచ్చిన పంట ఎక్కడ వర్షార్పణం అవుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో అకాల వర్షాలు మొదలయ్యాయి. అయినప్పటికీ ప్రభుత్వం నష్టనివారణ చర్యలపై దృష్టి పెట్టలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వేగంగా కొనుగోళ్లు చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా ఉన్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన టార్పాలీన్లను ప్రభుత్వం ఇప్పటి వరకు సరఫరా చేయలేదని తెలిసింది. ఈ విధంగా రైతులు కష్టాలు పడుతూ నష్టాలు ఎదుర్కొంటుంటే ప్రభుత్వం, సివిల్ సప్లై అధికారులు ఏమీ పట్టనట్టుగానే వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### క్వింటాకు 500 నష్టపోయాం

80 కిలోమీటర్ల దూరం నుంచి కిరాయి పెట్టి రెండు ట్రాక్టర్లలో ధాన్యాన్ని తీసుకొచ్చి మిర్యాలగూడలోని మిల్లులకు తీసుకొస్తే.. క్వింటా రూ.2,300 ధర పడింది. ప్రభుత్వం ఇస్తామన్న బోనస్‌తో కలిపి ఇస్తే రూ.2,820 వచ్చేవి. ఇప్పుడు క్వింటాకు రూ.500 నష్టపోయాను. అధికారులు ధాన్యం విక్రయాల వైపు చూసే పరిస్థితే లేదు.

**- వెంకట్‌రెడ్డి, రైతు, అర్వపల్లి**

### తక్కువ ధరకే అమ్ముకున్న

నేను 45 క్వింటాళ్ల ధాన్యాన్ని రూ.2,350 లెక్కనే అమ్ముకున్నాను. ఎన్ని మిల్లులు తిరిగినా అంతా ఒకే రేటు అడిగారు. గతేడాది ఇదే రోజుల్లో క్వింటా రూ.2,600కి పైగా అమ్ముడుపోయింది. ఇప్పుడు మాత్రం ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. మిల్లులకు తెచ్చిన ధాన్యాన్ని వెనక్కి తీసుకొని పోలేక తప్పని పరిస్థితుల్లో తక్కువ ధరే అయినా అమ్ముకున్నాను. **- జానయ్య, రైతు, నకిరేకల్**

### ఎరువుల కోసం మళ్లీ చెప్పులు



*వానకాలం రైతు భరోసాను ఎగ్గొట్టిన ప్రభుత్వం యాసంగి సన్నద్ధమవుతున్న రైతులకు ఎరువులను కూడా అందుబాటులో ఉంచడం లేదు. నిర్మల్ జిల్లా బాసరలోని విక్రయ కేంద్రం వద్ద సోమవారం ఎరువుల కోసం రైతులు బారులు తీరారు. మండలంలో ఒకే విక్రయ కేంద్రం ఉండడంతో ఉదయం 4 గంటల నుంచే క్యూలైన్‌లలో వేచి ఉంటున్నారు. లైన్‌లో నిల్చొని కాళ్ల నొప్పులు రావడంతో చెప్పులను లైన్‌లో పెట్టి కాపు కాస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.*

*- బాసర*

## జప్తు చేసిన ఆస్తులను అన్యాక్రాంతం చేయొద్దు

**రైస్ మిల్లర్లకు హైకోర్టు ఉత్తర్వులు**

హైదరాబాద్, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం అప్పగించిన ధాన్యం ఆధారంగా పౌరసరఫరాల శాఖకు కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను అప్పగించకపోవడంతో రెవెన్యూ రికవరీ (ఆర్‌ఆర్) చట్టం కింద జప్తు చేసిన స్థిరాస్తులను క్రయవిక్రయాలు లేదా అన్యాక్రాంతం చేయరాదని రైస్ మిల్లర్లకు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్‌ఆర్ చట్టం అమలుకు ముందు మిల్లర్లకు నోటీసులు ఇచ్చిందీ లేనిదీ చెప్పాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. సీఎంఆర్‌ను అప్పగించని మిల్లర్ల ఆస్తుల జప్తును రద్దు చేస్తూ సింగిల్ జడ్జి తీర్పునకు వ్యతిరేకంగా ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీళ్లపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రీనివాసరావు ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. సీఎంఆర్ కోసం మిల్లర్లకు తగినంత సమయం ఇచ్చినా ఫలితం లేకపోవడంతో కలెక్టర్లు తనిఖీ చేసి ధాన్యాన్ని స్వాధీనం చేసుకున్నారని అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. మిల్లర్ల నుంచి ప్రభుత్వానికి 90 కోట్లు రావాల్సి ఉన్నదని చెప్పారు. మిల్లర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు ప్రతివాదన చేస్తూ..ఆర్‌ఆర్ యాక్ట్ కింద ముందుగా నోటీసులు జారీ చేయలేదని పేర్కొన్నారు. ఏజీ కల్పించుకుని మిల్లర్లకు నోటీసులు జారీ చేసిందీ లేనిదీ తెలుసుకుని చెప్పేందుకు గడువు కావాలని కోరడంతో తదుపరి విచారణను నవంబర్ 5కు వాయిదా వేస్తున్నట్టు ధర్మాసనం ప్రకటించింది.

## మార్గదర్శి వివరాలను ఇచ్చేందుకు ఇబ్బందేమిటి?

హైదరాబాద్, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ): మార్గదర్శి చిట్‌ఫండ్ చందాదారులకు చెల్లింపులు చేపట్టామని సుప్రీంకోర్టుకు సమర్పించిన 69,531 పేజీల వివరాలను మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్‌కు పెన్‌డ్రైవ్‌లో ఇచ్చేందుకు ఉన్న ఇబ్బందులేమిటో చెప్పాలని ఆ సంస్థను హైకోర్టు జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం సోమవారం ప్రశ్నించింది. అందుకు గడువు కావాలని మార్గదర్శి తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా కోరడంతో విచారణ వాయిదా పడింది. నవంబర్ 4న జరిగే తదుపరి విచారణకు రిజర్వు బ్యాంకు, మార్గదర్శి ప్రతినిధులతో పాటు ఏపీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల న్యాయవాదులు హాజరుకావాలని హైకోర్టు ఆదేశించింది.


మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలో రైతులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వస్తున్న మాజీ ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యానాయక్


నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం మాణిక్‌భండార్ వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మతో నిరసన తెలుపుతున్న ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు

# భరోసా..బరాబర్ ఇవ్వాల్సిందే

- రెండో రోజూ ఆందోళనలు
- బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకోలు
- వనపర్తి జిల్లాలో సీఎం రేవంత్ దిష్టిబొమ్మ దహనం
- ఆదిలాబాద్ కలెక్టరేట్ ముట్టడి
- తుడుందెబ్బ ఆందోళన.. ఉద్రిక్తత
- ఆందోళనలు అడ్డుకున్న పోలీసులు
- కాంగ్రెస్ సర్కారుపై భగ్గుమన్న రైతులు

(నమస్తే తెలంగాణ, న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్ర ప్రభుత్వం వానకాలం రైతు భరోసా ఎగ్గొట్టడంపై రైతుల పక్షాన గులాబీదళం గళం విప్పింది. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రెండోరోజూ సోమవారం నిరసనలు జోరుగా జరిగాయి. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా ఇవ్వాలని ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో రైతులు నిర్వహించిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. జిల్లాలోని పలు గ్రామాలకు చెందిన గిరిజన రైతులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా అనంతరం ఆదివాసీ హక్కుల పోరాట సమితి నాయకులు, రైతులు కలెక్టర్ రాజర్షి షాకు వినతిపత్రం అందజేసేందుకు పోలీసులను తప్పించుకుంటూ సంఘాల నాయకులు కార్యాలయంలోకి వచ్చారు. వారిని పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. కలెక్టర్ రాజర్షా షా ప్రజావాణి కార్యక్రమం నుంచి బయటకు వచ్చి తుడుందెబ్బ నాయకులు, రైతులతో మాట్లాడారు. వినతిపత్రం ఇవ్వడానికి వస్తున్న పోలీసుల తమపై, మహిళా నాయకురాళ్లపై దురుసుగా ప్రవర్తించారని, వారిపై అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని, తమను దుర్భాషలాడిన పోలీసులు క్షమాపణ చెప్పాలని రైతులు డిమాండ్ చేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని నస్రుల్లాబాద్, చందూర్, జుక్కల్ తదితర మండల కేంద్రాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. వనపర్తి జిల్లాలోని జంగమాయిపల్లిలో రైతులతో కలిసి బీఆర్‌ఎస్ నేతలు రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేశారు. మహబూబాబాద్ జిల్లా కురవి, నర్సింహులపేట మండల కేంద్రాల్లో సోమవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కురవిలో మాజీ ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యానాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భద్రాచలం అంబేద్కర్ సెంటర్లో బీఆర్‌ఎస్ నాయకులు రాస్తారోకో చేయగా, అశ్వాపురంలో నిరసన ప్రదర్శన నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. బూర్గంపహాడ్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. దుమ్ముగూడెం మండలం లక్ష్మీనగరంలో రాస్తారోకో చేశారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు బిట్టు శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రేణులు, రైతులు రాస్తారోకో నిర్వహించారు. అరగంట పాటు ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టడంతో రవాణా స్తంభించింది.ఎస్‌ఐ కొమురయ్య అక్కడికి చేరుకొని రాస్తారోకోను అడ్డుకున్నారు. సిర్పూర్(టీ) మండల కేంద్రంలోని బస్టాండ్‌లోగల ప్రధాన రహదారిపై బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ అస్లాంబిన్ అబ్దుల్లా ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, రైతులు ధర్నా నిర్వహించారు. ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా అందించాలని డిమాండ్ చేశారు.


ఆదిలాబాద్ కలెక్టరేట్ వద్ద గిరిజన సంఘాల నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు


వనపర్తి జిల్లా జంగమాయిపల్లిలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


వానకాలం రైతుభరోసాను ఇవ్వాల్సిందేనని భద్రాద్రి జిల్లా అశ్వాపురంలో ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు